


ధనియాన్‌చెరువు పాఠశాల

దాతల సొమ్ము స్వాహా..!

ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని గత వైసీపీ పాలకులు గొప్పలు చెప్పారు. నాడు-నేడుతో వాటి రూపురేఖలే మార్చేస్తామన్నారు. అభివృద్ధి సంగతి దేవుడెరుగు.. నిధులను అడ్డంగా మేసేశారు. పనులు ఎక్కడివక్కడే ఆపేశారు. ఆఖరుకు ఊరి పిల్లల బాగుకోరి దాతలిచ్చిన స్థలాన్ని కూడా ఆక్రమణ దారులకు వదిలేశారు. గతంలో ప్రహరీకి ఏర్పాటు చేసిన బండలు ఏమయ్యాయో తెలీదు. పాఠశాల గేటు కూడా కనిపించట్లేదు. ఏమయ్యాయో..? ఉన్న కాంపౌండ్ తొలగించి, కొత్తది నిర్మించక, గేటు తీసేసి.. కొత్తది ఏర్పాటు చేయకుండా వదిలేశారు. పశువులు, గొర్రెలు, మేకలు, సెలవురోజుల్లో మందు బాబులు పాఠశాలలోనే మకాం వేస్తున్నారు. ఇదీ గత వైసీపీ పాలనలో పాఠశాలల అభివృద్ధి సాగిన తీరు. నంబులపూలకుంట మండలం ధనియాన్ చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల దుస్థితి ఇది.



ప్రైవేటు వ్యక్తులకు స్థలాన్ని వదిలి కాంపౌండ్ నిర్మించిన దృశ్యం

- కాంపౌండ్ బండరాళ్లు ఏమయ్యాయో?
- గేటు ఎటుపోయిందో?
- నాడు-నేడు పనుల్లో గోల్‌మాల్
- ఆగిపోయిన నిర్మాణాలు
- తేలని ఖర్చుల లెక్కలు


ధనియాన్‌చెరువు పాఠశాలకు ముఖద్వారం తొలగించిన దృశ్యం

రికార్డులు లేవు..

నాడే-నేడు పనులు గత ప్రధానోపాధ్యాయుడు, ఇంజనీర్, కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో పనులు సాగాయి. ఎన్నికల సమయంలో ఎంఈఓ, ఎంపీడీఓ సూచించన పనులు మాత్రమే చేయించా. రికార్డులు పాఠశాలలో లేవు. ఇంజనీర్ సచివాలయానికి తీసుకెళ్లారు.
-భోగాతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు



పునాది దశలోనే అదనపు గదుల నిర్మాణం

ఆక్రమణలో పాఠశాల స్థలం

నంబులపూలకుంట, సెప్టెంబరు 18: మండలంలోని ధనియాన్‌చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గత వైసీపీ పాలనలో నాడు-నేడు రెండో విడత కింద పనులకు ఎంపిక చేశారు. పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గ్రామస్థులు వాపోతున్నారు. రూ.1.12 కోట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.32.50 లక్షల నిధులు విడుదల య్యాయి. ప్రస్తుతం రూ.7లక్షల వరకు నిధులున్నట్లు సమాచారం. పాఠశాల కాంపౌండ్ నిర్మాణానికి రూ.18.78 లక్షలు, మరమ్మతులకు రూ.42లక్షలు, అదనపు గదుల నిర్మాణానికి రూ.52లక్షలు మొత్తం రూ.1.12కోట్లు మంజూరు చేశారు. దీంతో పాఠశాల రూపురేఖలు మార్చి, పేద విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తామని గత పాలకులు గొప్పలు చెప్పారు. నిధులు రాక, వచ్చిన వాటిని స్వాహా చేయడంతో పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి.

కాంపౌండ్ బండరాళ్లు ఏమయ్యాయో?

ధనియాన్‌చెరువు గ్రామంలో గతంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండేది. తరువాత దానిని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలగా మార్చారు. గ్రామంలోనే పాఠశాల ఉంటే పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన శ్రమ ఉండదని కొంతమంది దాతలు స్థలం ఇచ్చారు. అప్పట్లో స్కూల్ గ్రాంట్‌తో పాఠశాల చుట్టూ నల్లబండరాళ్లు నాటారు. గత వైసీపీ హయాంలో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నాడు-నేడు నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రహరీ బండరాళ్లను తొలగించారు. వాటిని పాఠశాల సమీపంలోని వారితోపాటు, పక్క గ్రామాల వారికి అమ్మినట్లు సమాచారం. ఆ నిధులకు లెక్కలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో పునాదులు తీశారు. శరవేగంగా పనులు పూర్తవుతాయని గ్రామస్థులు ఆశించారు. గతంలో కదిరి-రాయచోటి రోడ్డు పనులు ప్రారంభించారు. పాత కల్వర్టులను తొలగిస్తుండగా.. అందులో నుంచి బయట పడిన రాళ్లను రాత్రికి రాత్రే తరలించి, పాఠశాల ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. విషయం బయటకు తెలియడంతో గ్రామస్థులు అప్పటి ప్రధానోపాధ్యాయుడు, ఇంజనీర్‌ను నిలదీశారు. దీంతో పనులు నిలిపివేశారు. ఆ తరువాత పనులు ముందుకు కదల్లేదు.


అసంపూర్తిగా మరుగుదొడ్లు

గేటు ఎటు పోయిందో..?

కదిరి-రాయచోటి ప్రధాన రహదారి నుంచి సోమరాజుకుంటకు వెళ్లే రహదారి పక్కనే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. రోడ్డు పక్కనే పాఠశాల ముఖద్వారం కనిపిస్తుండేది. నాడు-నేడు కింద పాఠశాలను ఎంపిక చేశాక మరమ్మతుల పేరుతో ముఖద్వారం గేటు తొలగించారు. నేటికీ గేటును అమర్చకపోవడంతో అలాగే ఉంది. అప్పట్లో గ్రామస్థులు అడగ్గా.. పాఠశాలకు ముఖద్వారం వాస్తు బాగోలేదనీ, మరో పక్క పెట్టాలని అప్పటి ప్రధానోపాధ్యాయుడు చెప్పినట్లు సమాచారం. పాఠశాలకు గేటు లేకపోవడంతో పశువులు ఇతర మూగజీవాలు లోపలికి ప్రవేశిస్తున్నాయి. సెలవురోజుల్లో మందుబాబులకు నిలయంగా మారుతోంది.

స్థలం దానంగా ఇస్తే..

ఊరిలోనే పాఠశాల ఉంటే ఈ ప్రాంత పిల్లలు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదన్న ఉద్దేశంతో గ్రామానికి చెందిన కొంతమంది దాతలు అప్పట్లో ఐదు ఎకరాలకుపైగా స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి ఇచ్చారు. పాఠశాల నిర్మించగా, మిగిలిన భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నా నాయకులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రహరీ నిర్మాణంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు స్థలాన్ని వదిలేసి, నూతనంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారంటే వారి వద్ద నుంచి కూడా మామూళ్లు పుచ్చుకున్నార్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల ఆవరణలో అదనపు గదుల నిర్మాణం చేపట్టడానికి చెట్లు అడ్డంగా ఉన్నాయని తొలగించి, విక్రయించారు. ఆ సొమ్ము ఏమైందో తెలియడంలేదని ప్రజలు అంటున్నారు. నాడు-నేడు పనుల్లో ఎంత ఖర్చు పెట్టారన్న లెక్కలు తేల్చక పోవడంతోనే నిలిచిపోయాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల పాఠశాల నూతన కమిటీ ఎంపికైంది. గతంలో ఖర్చు చేసిన వివరాలు చూపకపోవడంతో మిగిలిన సొమ్మును ఖర్చు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.



బండరాళ్లను అమ్ముకున్నారు

పాఠశాల చుట్టూ నాటిన నల్లని బండరాళ్లను తీసేశారు. నిర్మాణాలు చేపడతామని హడావుడి చేశారు. ఆ రాళ్లను విక్రయించేశారు. ఆ సొమ్ము కూడా దేనికి ఖర్చు పెట్టారో తెలియడంలేదు. అసంపూర్ణంగా ఉన్న నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి.
- వెంకటరమణారెడ్డి, ధనియాన్‌చెరువు



ముఖద్వారం గేటు ఉండేది

మా ఇంటి సమీపంలోనే పాఠశాల ఉంది. ముఖద్వారానికి అమర్చిన గేటును తొలగించారు. దీంతో పాఠశాలలో మూగజీవాలు సంచరిస్తున్నాయి. సెలవు రోజుల్లో మద్యం ప్రియులకు నిలయంగా మారుతోంది. పాఠశాలకు కాంపౌండ్ నిర్మించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.
- తిరుమల, పాత ధనియాన్‌చెరువు

సిమెంటు కొరతతోనే..

ప్రభుత్వం నుంచి సిమెంటు సరఫరా కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పనులు చేసినంత వరకు బిల్లులు చెల్లించాం. రూ.7 లక్షల నిధులు ఇంకా ఉన్నాయి. కంకర, ఇటుక, ఇసుక, కడ్డీలు, ఎలక్ట్రికల్ సామగ్రిని పాఠశాల ఆవరణలో నిలువ చేశాం.
- పృథ్వి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్



అక్కడ పై అధికారులు ఉన్నా.. లేనట్టే. వారు ఎవరి మాటా వినరు. వారు చేయాలనుకున్నది చేసేస్తారు. వసూళ్లలో ఎవరి తీరు వారిదే. ప్రజలేమనుకున్నా.. ఉన్నతాధికారులు ఎంత చెప్పినా వారు అస్సలు ఖాతరు చేయరు. గత ఐదేళ్లుగా చిలమత్తూరు పోలీసు స్టేషన్లో సెటిల్మెంట్ల తంతు కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో స్టేషన్‌లో కొందరు సిబ్బంది అవినీతికి అంతులేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు న్యాయం కోసం స్టేషన్‌కి వెళ్లాలంటే జంకుతున్నారు.
- చిలమత్తూరు

సెటిల్‌మెంట్ల స్టేషన్!

చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో వసూల్ రాజాలు


చిలమత్తూరు పోలీసు స్టేషన్

- కేసులు కట్టేందుకు ససేమిరా
- పంచాయితీలకే ప్రాధాన్యం
- ఖాకీ కనుసన్నల్లోనే పేకాట, మట్కా



• వసూళ్లలో పోటీ

గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు తమ సంపాదనను పెంచుకోవడానికి మార్గాలు వెతుక్కుంటున్నారు. రాష్ట్ర సరిహద్దుగా చిలమత్తూరు మండలం ఉండటంతో ఎక్కువగా అక్రమ రవాణా, నేరాలు జరుగుతుంటాయి. దానికితోడు 44వ, 544-ఈ జాతీయ రహదారులు మండలం మీదుగా వెళ్లుండడంతో రోజూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాపై నిఘా ఉంచాల్సిన కొందరు పోలీసులు దానిని ఆదాయ మార్గంగా మలుచుకున్నారు. ఇసుక అక్రమ రవాణాలో కొందరికి వత్తాసు పలికి వారి నుంచి పెద్ద ఎత్తున మామూళ్లు దండుకుంటున్నారన్నది బహిరంగ రహస్యమే.

• కేసులుండవ్...

సాధారణంగా ఎవరికైనా అన్యాయం జరిగితే వెంటనే స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేస్తారు. చిలమత్తూరు స్టేషన్‌లో మాత్రం కేసు పెట్టాలని బయల్దేరిన వారిని దారి మధ్యలోనే అడ్డుకుని, సెటిల్‌మెంట్ చేసి పంపేయడం పరిపాటిగా మారింది. ఈ సెటిల్‌మెంట్‌లో పలువురు పోలీసు సిబ్బంది మధ్యవర్తుల అవతారమెత్తి జేబులు నింపుకుంటున్నారు. అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులు వాలిపోతారు. వారిని స్టేషన్‌కి తీసుకెళ్తున్నట్లు భ్రమ కలిగించి దారి మధ్యలోనే సెటిల్‌మెంట్ చేసుకుని, వదిలేసిన దాఖలాలు కోకొల్లలు.

• వారి కనుసన్నల్లోనే పేకాట, మట్కా

పేద, మధ్యతరగతి కుటుంబాలను నాశనం చేస్తున్న పేకాట, మట్కా తదితరాలకు కొంతమంది సిబ్బంది పుష్కలంగా సహకారం అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. సరిహద్దు కావడంతో ఎక్కువగా కర్ణాటక వాసులు వచ్చి పేకాట ఆడిస్తుంటారు. నిర్వాహకులతో పోలీసు సిబ్బంది సంబంధాలు పెట్టుకుని, వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వచ్చినపుడు నామమాత్రంగా దాడులు చేస్తూ.. మభ్యపెడుతున్నారని తెలుస్తోంది. మిగిలిన రోజుల్లో పేకాట నిర్వాహకులు వీరి కనుసన్నల్లోనే ఉంటారనడంలో సందేహం లేదు. స్పెషల్ పార్టీ పోలీసులు దాడులకు దిగితే ముందుస్తుగా పేకాట నిర్వాహకులకు సమాచారం చేరవేస్తూ తమ నీతిని చాటుకుంటుంటారు. మట్కా విషయానికి వస్తే ఏయే గ్రామాల్లో మట్కా జరుగుతోందో అందరికీ తెలిసిందే. మట్కా పట్టీలు రాసే వారుతో సత్సంబంధాలు ఏర్పరచుకొని వారి కార్యకలాపాలకు అడ్డుచెప్పకుండా, వారి వివరాలను ఉన్నతాధికారులకు చేరవేయకుండా సాయం చేస్తుంటారు.



• అందరిపై ప్రభావం

స్టేషన్‌లోని కొందరు సిబ్బంది ఇలాంటి సంపాదనకు పాల్పడుతూ, నిజాయితీతో పనిచేసే ఉద్యోగులపై ప్రభావం చూపుతున్నారు. స్టేషన్‌లో చాలాకాలంగా వేళ్లూనుకుపోయిన ఉద్యోగులు కొత్తగా వచ్చిన వారికి ఆదాయ మార్గాలను చూపిస్తున్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని వచ్చిన వారు కూడా సీనియర్ల సంపాదన చూసి అడ్డదారులు తొక్కుతున్నారు. పైసలు ఇస్తేనే పని జరుగుతుంది అనే స్థాయికి స్టేషన్ వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొందరు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి వారి చెప్పినవిధంగా నడుచుకుంటూ ప్రజల్లో పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చిలమత్తూరు స్టేషన్‌పై దృష్టిపెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఉంటుంది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పోలీసులు క్రమశిక్షణ ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు. తీరుమార్చుకోని సిబ్బందిపై ప్రత్యేక దృష్టి పెడతాం. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు ఊతం ఇచ్చినా క్షమించేది లేదు.
- మహేష్, హిందూపురం డీఎస్పీ

న్యాయం.. అపహాస్యం..

- మహిళపై అధికార పార్టీ కార్యకర్త అత్యాచారయత్నం
- కేసు నమోదు చేయకుండా దుప్పటి పంచాయితీ
- మరో ఘటనలో ఒత్తిళ్లు తెచ్చి.. కేసు కట్టించిన వైనం

హిందూపురం, సెప్టెంబరు 18: న్యాయాన్ని అపహాస్యం చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిందే న్యాయమవుతోంది. చిలమత్తూరు మండలంలో రెండు అత్యాచారయత్నం ఘటనల్లో అధికార పార్టీ నాయకులు విరుద్ధంగా వ్యవహరించారు. అధికార పార్టీ కార్యకర్త.. మహిళపై అత్యాచారానికి యత్నిస్తే.. దుప్పటి పంచాయితీ ద్వారా కేసు కట్టకుండా చేశారు. మరో అత్యాచార యత్నం కేసులో మాత్రం ఒత్తిడి తెచ్చి మరీ.. కేసు నమోదు చేయించారు.

ఒక్కొక్కరికి ఒక్కోలా..

చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ బెంగళూరుకు జీవనోపాధికి వెళుతోంది. రెండురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం బెంగళూరు వెళ్లేందుకు బయలుదేరి స్వగ్రామంలో ఆటోకోసం వేచి ఉంది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోడూరు తోపు వరకు డ్రాప్ చేస్తానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. ఎక్కడికి వెళ్లాలని అడిగాడు. బెంగళూరుకు వెళ్తున్నానని చెప్పడంతో తాను కూడా బాగేపల్లికి వెళ్తున్నానని చెప్పి, అక్కడే దింపుతానన్నాడు. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని ఓ గుట్ట వద్ద చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేసి కొంతదూరం వెళ్లి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వారు అక్కడకు చేరుకుని అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి చేయడానికి ప్రయత్నించారు. వారిరువురు ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో పెద్దమనుషులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించింది. ఆ మండలంలో అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించే ఓ నాయకుడి వద్దకు పంచాయితీ చేరింది. ఆయన దుప్పటి పంచాయితీ చేసి ఆమె ఫిర్యాదు చేయకుండా అడ్డుకోనిచ్చాడని తెలిసింది. ఆమె ఫిర్యాదు చేసినా పట్టించుకోకూడదని పోలీసులకు కూడా సదరు నాయకుడు చెప్పినట్లు సమాచారం. ఈ అఘాయిత్యానికి పాల్పడింది అధికార పార్టీ కార్యకర్త. ఇదే గ్రామంలో మంగళవారం కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసి మరీ కేసు కట్టించినట్లు మండలంలో చర్చ సాగుతోంది. దీంతో అధికార పార్టీ నాయకులు చెప్పిందే న్యాయమవుతోందని మండలవాసులు మండిపడుతున్నారు.

సత్యసాయి సేవలు అమోఘం

అనంద్‌కృష్ణ గురూజీ.. ఆర్జే రత్నాకర్‌తో ఇండోనేషియా భక్తుల భేటీ


ఆర్జే రత్నాకర్‌తో ఇండోనేషియా బృందం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 18: ప్రపంచ ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా సేవలు అమోఘం, ఆచరణీయమని ఇండోనేషియాకు చెందిన ఆనంద్‌కృష్ణగురూజీ కొనియాడారు. ఇండోనేషియాకు చెందిన 15 మంది సభ్యుల బృందం బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రశాంతి నిలయం చేరుకుని, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌తో భేటీ అయ్యారు. వారు మాట్లాడుతూ.. ఎందరో అవతారమూర్తులు భారతదేశంలో జన్మించడం భరతజాతి చేసుకున్న పుణ్యమన్నారు. సంస్కృతీసంప్రదాయాల్లో భారత్‌కు ప్రపంచంలో మరేదేశమూ సాటిలేదన్నారు. సత్యసాయిబాబా స్ఫూర్తితో ఇండోనేషియాలోని జకర్తా, బాలిలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సత్యసాయిబాబా వైభవాన్ని ట్రస్టువారు ముందుకు తీసుకెళ్తున్న విధానం అభినందనీయమన్నారు. అనంతరం ఇండోనేషియా బృంద సభ్యులకు బాబా చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు.

దరఖాస్తు చేసుకున్నవారికే ఇసుక: కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 18: ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఉచిత ఇసుక సరఫరాకు నూతన మార్గదర్శకాల అమలుపై స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి నూతన మార్గదర్శకాలు అమలులోకి వస్తాయన్నారు. ఆ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేస్తామన్నారు. ఇసుక తరలించే వాహనాలు సైతం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగాగానీ, గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ చేయాల్సి ఉంటుందనీ, రోజుకు 60 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లోని పెద్దచిగుళ్ల రేవు, చిన్నచిగుళ్లరేవు రీచ్‌ల నుంచి గురువారం నుంచి ఇసుక సరఫరా చేస్తామన్నారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్, ఏఎస్పీ శ్రీనివాసులు, గనుల శాఖాధికారి రాంమోహన్, జలవనరుల శాఖాధికారి మల్లికార్జునరావు, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివారెడ్డి, డీఎల్డీఓ శివకుమారి, ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలుడి దవడలోకి చొచ్చుకుపోయిన బ్రష్

శస్త్రచికిత్స ద్వారా తొలగించిన కదిరి ఆస్పత్రి వైద్యులు


బాలుడి దవడలోకి చొచ్చుకుపోయిన బ్రష్


శస్త్రచికిత్స చేసి తొలగించిన బ్రష్

కదిరి అర్బన్, సెప్టెంబరు 18: స్థానిక సైదాపురానికి చెందిన ఆంజి కుమారుడు ప్రవీణ్ బుధవారం ఉదయం దంతాలు తోముకుంటుండగా.. ప్రమాదవశాత్తు కిందపడి దవడలోకి టూత్ బ్రష్ చొచ్చుకుపోయింది. వెంటనే బాలుడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్లు హుస్సేన్, లక్ష్మీపతి, మౌనాలిసాలక్ష్మి 45 నిమిషాలపాటు శస్త్రచికిత్స చేసి, బ్రష్‌ను తొలగించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు.

మెడికల్ కళాశాలలో సంబరాలు

సీట్లు పెంచడంపై హర్షం



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావును సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, సెప్టెంబరు 18: ఎంబీబీఎస్ సీట్లు పెంచడంపై బుధవారం మెడికల్ కళాశాలలో సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లకు అదనంగా మరో 50 సీట్లు పెంచి ఈ విద్యా సంవత్సరం నుంచే అవకాశం కల్పిస్తూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, మెడికోలు సంబరాలు చేసుకున్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న కల నెరవేరడంతో ఆనందం ఉప్పొంగింది. ఇందుకు పట్టుదలగా కృషిచేసిన ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో అదనంగా 50సీట్లు పెంచుకోగలిగామన్నారు. గత ఆరు నెలలుగా కష్టపడుతున్నా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, షంషాద్‌బేగం, షారోన్‌సోనియా, శ్యాంప్రసాద్, ప్రవీణ్‌దీన్‌కుమార్, పద్మశ్రావణి, శ్రీనివాసరావు, మధుసూదన్, బసిరెడ్డి, ప్రవీణ, మల్లిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బదిలీ

పుట్టపర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల రిజిస్ట్రార్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లాకు నియమించింది. కొత్త జిల్లా ఏర్పాటు చేసినప్పట్నుంచి కృష్ణకుమారి ఇక్కడ పనిచేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

నూతన డీఐజీగా విజయలక్ష్మి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఎస్.మాధవి బదిలీ అయ్యారు. మాధవిని ఏలూరు డీఐజీగా బదిలీ చేస్తూ ఆ శాఖ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో విజయనగరం డీఐజీ పి.విజయలక్ష్మిని నియమించారు. మార్కెట్ వాల్యూ, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా బి.శ్రీనివాసులును నియమించారు. ప్రస్తుతం కర్నూలు నోడల్ డీఆర్ నాగలింగేశ్వరరావు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.

అత్యాచారయత్నం.. కేసు నమోదు

చిలమత్తూరు, సెప్టెంబరు 18: ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహితపై అత్యాచార యత్నం చేశాడనే ఫిర్యాదుతో ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన శివవర్ధన్ అనే యువకుడు మంగళవారం అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి వెళ్లి అత్యాచార యత్నం చేశాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వెళ్లి విచారించిన పోలీసులు యువకుడిపై ఐపీసీ 65, 75, 351, 333 సెక్షన్ల ప్రకారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాతలారా..! పుస్తకాలివ్వండి..!

- విద్యార్థుల్లో వికాసాన్ని పెంపొందించండి
- బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 18: 'దాతలారా..! ముందుకు రండి.. ప్రభుత్వ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థుల్లో విద్యావికాసాన్ని పెంపొందించేందుకు సహకరించండి' అని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 55 బీసీ వసతిగృహాల్లో 8,288 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారన్నారు. ఆయా వసతిగృహాల్లోని విద్యార్థులకు లోకజ్ఞానం, విద్యావికాసం పెంపొందించేందుకు మినీ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దాతలు విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలు, నీతికథలు, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, తెలుగు, ఇంగ్లీష్ టు తెలుగు డిక్షనరీ పుస్తకాలను విరాళంగా ఇచ్చేవారు అనంతపురం రుద్రంపేటలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. దాతలు అందించే పుస్తకజ్ఞాన సంపద పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని వివరాలకు బీసీ సంక్షేమశాఖాధికారి సెల్ : 9414055515ను సంప్రదించాలన్నారు.

రైల్వేలో పత్తాలేని వైఫై

- ప్లాట్‌ఫారాల్లో బోర్డులూ తొలగింపు
- ఆరు నెలలకే ఆటకెక్కించిన వైనం

గుంతకల్లు, సెప్టెంబరు 18: దేశ వ్యాప్తంగా రైల్వే పెద్ద స్టేషన్లలో వంద శాతం వైఫై సేవలను అందుబాటులోకి తెచ్చామంటూ చేసిన ప్రకటనలు నీటిమీది రాతలయ్యాయి. ప్రయాణికులకు ప్రయాణంలో ఉచిత వైఫై సదుపాయం కల్పించడానికి రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. ఆరు నెలల కాలంలోనే రైల్ వైర్ పేరిట దేశవ్యాప్తంగా అన్ని ఏ-1, ఏ క్లాస్ స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం పూర్తయిందంటూ రైల్వే శాఖ ప్రకటించింది. కానీ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో క్షేత్రస్థాయికి వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. ప్రస్తుతం ఏ స్టేషన్‌లోనూ వైఫై కనెక్ట్ కావడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఏ స్టేషన్‌లోనూ ఉచిత ఇంటర్నెట్ అందుబాటులో లేదంటున్నారు.



రైల్వే వైఫై లోగో

డివిజన్‌లో 114 స్టేషన్లకు వైఫై

దేశవ్యాప్తంగా రైళ్లలో ప్రయాణికుల ఉపయోగార్థం ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పించడానికి 2018లో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా 1 ఎంబీపీఎస్ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఉచితంగా అరగంట సేపు వినియోగించేందుకు అవకాశం కల్పించారు. తర్వాత రూ. 10 ధరతో 34 ఎంపీబీఎస్ స్పీడ్ కలిగిన 5 జీబీల డేటాను వాడుకునే వెసులుబాటు కల్పించారు. మరికొన్ని ప్యాకేజీలను ప్రకటించారు. ఈ మేరకు గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని ఏ-1, ఏ, బీ క్లాస్ రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యాన్ని కల్పించినట్లు అధికారులు ప్రకటించారు. 2021 డిసెంబరులో గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని ఏ-1 క్లాస్ రైల్వే స్టేషన్ అయిన తిరుపతిలో వైఫై సదుపాయాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏ- కేటగిరి స్టేషన్లయిన గుంతకల్లు, అనంతపురం, రాయచూరు, కడప, రేణిగుంట, ధర్మవరం స్టేషన్లకు వై-ఫై సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఆరంభ ఆర్భాటం తప్ప అమలులో ఆసక్తిని కనబరచలేదు.

ఆర్నెళ్లకే అటకెక్కించారు..

ఎంతో ఆర్భాటంగా చేపట్టిన ఉచిత వైఫై పథకాన్ని ఆర్నెళ్లకే అటకెక్కించారు. డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో ఉచిత వైఫై సదుపాయం వచ్చాక వెయిటింగ్ హాళ్లలో విశ్రాంతి తీసుకునే ప్రయాణికులకు, ప్లాట్‌ఫారాలపై రైళ్ల కోసం ఎదురుచూసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఆరు నెలలు సక్రమంగా నిర్వహించి తర్వాత వైఫైని ఆన్ చేయడం మానేశారు. మూడేళ్లుగా ఉచిత వైఫై పనిచేయడం లేదు. పక్కనున్న రైల్వే డివిజన్లలో ఉచిత వైఫై సదుపాయం కొనసాగుతుండగా గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఈ పథకాన్ని నీరుగార్చారు. రైల్వే స్టేషన్‌లో వైఫైకి సంబంధించిన వ్యవస్థ అలాగే ఉన్నా వినియోగించడం లేదు. ప్లాట్‌ఫారాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైఫై బోర్డులను అధికారులు తొలగించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను ప్రశ్నించినా తగిన సమాధానం ఇవ్వలేదు. అరగంట ఉచిత ఇంటర్నెట్ వినియోగించిన తర్వాత ప్రయాణికులు పెయిడ్ ప్యాకేజీలను రీచార్జ్ చేయకపోవడమే కారణంగా కనిపిస్తోంది.



నీరు లేక ఎండిపోతున్న వరి పొలం



కాలువలో అడ్డంగా పడిన జంబు మొక్కలు

చివరికి నష్టమేనా..?

పంటలు ప్రశ్నార్థకం

- జీబీసీ పిల్ల కాలువలకు అందని సాగు నీరు
- ఎండిపోతున్న వరి, మిర్చి, కంది పంటలు
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు
- నేడు ఐఏబీ సమావేశం.. న్యాయం జరిగేనా..?

విడపనకల్లు, సెప్టెంబరు 18: గుంతకల్లు బ్రాంచ్ కాలువకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో సాగు చేసిన మిర్చి, వరి పైర్లకు సాగు నీరు అందక పొలాలు నెర్రెలుబారి ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంకో 10 రోజులు నీరు రాకపోతే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే. ఎండుతున్న పంటలను చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. జీబీసీకి పూర్తి స్థాయిలో సాగునీరు రాక పోవటమే ఇందుకు కారణం. జీబీసీ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉరవకొండ నియోజక వర్గంలో 25 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. 3వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 9వ డిస్ట్రిబ్యూటరీ వరకూ నీరు పారటంలేదు. 6, 7, 8, 8ఆర్, 8ఏ, 9వ డిస్ట్రిబ్యూటరీల కింద దాదాపుగా 9వేల ఎకరాల్లో మిర్చి, కంది, వరి పంటలు సాగు చేశారు. 6,7వ కాలువలకు కొద్దిగా నీరు అందుతున్నా కిందికి వెళ్లటంలేదు. 8, 8ఆర్, 8ఏ, 9వ కాలువలకు చుక్క కూడా నీరు అందటంలేదు. దీంతో రెండు నెలలుగా సాగు చేసిన పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. ట్రాక్టర్లను ఉపయోగించుకుని వరి పొలాలకు నీటిని కడుతున్నారు.

చివరి ఆయకట్టుకు అందని నీరు

జీరో టు జీరో వద్ద గత సంవత్సరం వర్షాలకు హెచ్ఎల్‌సీ కోతకు గురైంది. జీబీసీ దాదాపుగా మూడున్నర అడుగుల మేరకు మట్టితో పూడుకుపోయింది. గత వైసీపీ ప్రభుత్వం పూడిక తీత పనులు చేయించి ఉంటే ప్రస్తుతం నీరు ముందుకు సాగేది. హెడ్ వద్ద 8.5 అడుగులు రావాల్సిన చోట 6.3 అడుగుల నీరు మాత్రమే వస్తోంది. దీనికి తోడు అక్విడెట్ల వద్ద లీకేజీలు, నాన్ ఆయకట్టు రైతులు అడుగడుగునా నాలుగు ఇంచుల మోటార్లు పెట్టి జల చౌర్యం చేస్తుండడంతో సమస్య మరింత జటిలమయింది. కొంత మంది నాన్ ఆయకట్టు దారులు జీబీసీ నుంచి దాదాపుగా ఒకటి, రెండు కిలోమీటర్ల పొడవు పైపులైన్లు వేసి నీటిని లాగేస్తున్నారు. ఇక కాలువలు కింద సాగు చేసే ఆయకట్టు రైతులకు సాగు నీరు ఏవిధంగా వస్తుందని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఐఏబీ సమావేశంలో న్యాయం జరిగేనా?

అనంతపురంలో గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో జీబీసీ కాలువ కింద పంటలు సాగు చేసిన రైతులకు సాగు నీరు అందించేందుకు నిర్ణయం తీసుకుంటారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలో దాదాపుగా నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులతో చర్చించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆశిస్తున్నారు.

పంట ఎండిపోతోంది..



నేను, మా అన్నదమ్ములు ముగ్గురం కలిసి బొమ్మనహాళ్ మండలం నుంచి వచ్చి విడపనకల్లు మండలంలోని జీబీసీ కింద ఒక్కొక్కరు 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. 8ఆర్ కాలువ కింద వరి పంటను సాగు చేశాం. వరి నాట్లు వేసి నెల రోజులు దాటి పోయింది. పిలకలు వచ్చే సమయంలో కాలువకు చుక్క నీరు రాక నేల మొత్తం నెర్రెలు చీలి పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఇంకో పది రోజుల్లో నీరు రాక పోతే సుమారు రూ. 7లక్షలు నష్టపోతాను.

- హనుమంతరాయుడు, కౌలు రైతు, గౌనూరు

చుక్కనీరు రాలేదు..



నేను జీబీసీ కింద డొనేకల్లు దారికి 8 ఎకరాల్లో మిర్చి, ఆర్.కొట్టాల దారిలో 12 ఎకరాల్లో వరి సాగు చేశాను. నెలన్నర అయినా చివరి ఆయకట్టుకు చుక్కనీరు రావటంలేదు అప్పుడప్పుడు వర్షాలు రావటంతో కొంత వరకూ పంటలు మిగిలాయి. ఇప్పుడు ఆ వర్షాలు కూడా రాలేదు. జీబీసీకి నీరు రావటంలేదు. వరి పొలం మొత్తం చీలికలు మారి ఎండిపోతోంది. కనీసం పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు వస్తే తప్ప పంటలను కాపాడుకోలేం. నీళ్లు రాకపోతే సుమారు రూ.10లక్షలు పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుంది.

- ఎర్రిస్వామి, విడపనకల్లు

అప్పులు చేసి పెట్టుబడి పెట్టా



నేను అప్పులు చేసి రెండు ఎకరాల్లో వరి, మరో రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. జీబీసీకి చుక్కనీరు రావటంలేదు. పంటలు పూర్తిగా ఎండిపోయేటట్లు ఉన్నాయి. చివరి ఆయకట్టు రైతులకంటే నాన్ ఆయకట్టు రైతులకే మంచి రోజులు ఉన్నాయి. నాన్‌ఆయకట్టు రైతులు మోటార్లు పెట్టి సాగునీటిని వాడుకోవటంతో కింద ఉన్న ఆయకట్టు రైతులకు నీరు రావటంలేదు. ఇంకో వారం రోజుల్లో నీరు రాకపోతే పంటలు మొత్తం ఎండిపోయి నష్టాలు పాలు కావాల్సిందే.

- ఏసీ వన్నూరుస్వామి, ఆర్. కొట్టాల

రైతులకు న్యాయం చేస్తాం..



అనంతపురంలో గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చించి కాలువలో పూడిక తీయించి, పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేడుతాం. కాలువకు పూర్తి స్థాయిలో 350 క్యూసెక్కుల నీటిని ఇచ్చే ఏర్పాటు చేస్తాం. పూడిక తీయకపోవటం వల్ల సాగు నీరు ముందుకు వెళ్లలేక పోతోంది. నాన్ ఆయకట్టు రైతులు నీటిని వాడుకోవటం, అక్కడక్కడ లీకేజీలు ఉండటం కొంత సమస్యగా ఉంది. వాటిని అన్నిటిని అధిగమించి చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే బాధ్యతను తీసుకుంటాం.

- వెంకటరమణ, ఈఈ

నేడు ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్ హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. హంద్రీ నీవా, మైనర్ ఇరిగేషన్‌తో పాటు హెచ్చెల్సీకి కేటాయించిన నీటి విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి దులీప్‌ట్రోఫీ చివరి పోటీలు

- ప్రత్యేక ఆకర్షణగా సూర్యకుమార్
- పాసుల జారీలో అదే గందరగోళం
- ఆందోళనలో క్రికెట్ అభిమానులు
- కొరవడిన సమన్వయం
- ప్రాక్టీస్ చేసిన ప్లేయర్లు





బ్యాటింగ్ ప్రాక్టీసుకు వెళుతున్న సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18: చివరి విడత దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో మూడో రౌండ్ పోటీలకు క్రీడాకారులు సిద్ధమయ్యారు. మొదటి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న భారత క్రికెట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ మూడో విడత పోటీలకు ఇండియా-బి జట్టుకు చేరారు. గురువారం ఇండియా-డి జట్టుతో జరిగే మ్యాచ్‌కు సర్ఫరాజ్‌ఖాన్ స్థానంలో సూర్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తుండడం అభిమానులకు పండుగలా మారింది. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న సూర్యకుమార్ యాదవ్‌పైనే అందరి దృష్టి పడింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇండియా ఎ, బి, సి, డి జట్ల ప్లేయర్లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్ 1, 2తో పాటు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్, ఫీల్డింగ్‌లో ముమ్మర సాధన చేశారు. బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్ పిచ్‌లను తయారు చేశారు. మొదటి విడతలో బౌలింగ్, రెండో విడతలో బౌలింగ్, బ్యాటింగ్‌కు పిచ్ అనుకూలించింది. మూడో విడత మ్యాచ్‌లకు పిచ్ ఏ స్థాయిలో అనుకూలిస్తుందో వేచి చూడాలి.

పాసుల జారీలో అదే గందరగోళం

దులీప్‌ట్రోఫీ మూడో విడతకు సంబంధించి పాసుల జారీపై నిర్వాహకులు స్పష్టత ఇవ్వలేదు. మొదటి మ్యాచ్‌కు జరిగిన గందరగోళమే చివరి విడత పోటీలకు కొనసాగుతోంది. గురువారం ప్రారంభమయ్యే మ్యాచ్‌కు సంబంధించి స్టేడియంలో ప్రేక్షకుల గ్యాలరీలలోకి ప్రవేశానికి పాసులు జారీలో ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. రెండో రౌండ్ పోటీల తరహాలో ఆయా విద్యాసంస్థలకు సంబంధించి పాసులు ఇచ్చి ప్రవేశం కల్పిస్తారా...లేక సాధారణ ప్రజలకు పాసులు ఇస్తారా అనేది ఇంతవరకు తేల్చలేదు. ఆయా సంఘాల పేరుతో పాసులను తమకు నచ్చిన, అనుయాయులకు మాత్రమే అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు వచ్చిన అరుదైన అవకాశాన్ని ఇలా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొరవడిన సమన్వయం

ఎన్నడూ లేని విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న దులీప్‌ట్రోఫీలో సమన్వయం కొరవడింది. బీసీసీఐ, ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘాల మధ్య కొరవడిన సమన్వయ లోపంతో దేశవాళీ క్రికెట్ పోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బీసీసీఐ నుంచి సుమారు రూ.5కోట్ల వరకు దులీప్‌ట్రోఫీ నిర్వహణకు నిధులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నిధులు ఏవిధంగా ఖర్చు చేస్తున్నారనేది కూడా రహస్యంగానే ఉంచుతున్నారు. మ్యాచ్ నిర్వహణ బాధ్యత ఎవరిది...ఎవరెవరికి ఏయే బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేసిన దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఎక్కడ ఉంది అనేది అందరిలో కలుగుతున్న సందేహం. పరపతి ఉన్నోడికి...ఆయా సంఘాల్లో ఉన్న వాళ్లకే సాధారణ పాసులతో పాటు వీఐపీ, వీవీఐపీ పాసులు ఇస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఏ, బీ గ్యాలరీల్లో అసలు ఎవరు వచ్చి క్రికెట్ చూస్తున్నారు. వారికి ఆ పాసులు ఎలా వచ్చాయనే కనీసం ఆరా తీయకుండా దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఉంది. గురువారం నుంచి జరిగే మ్యాచ్‌కు క్రికెట్ అభిమానులు ఎలా వచ్చి చూడాలి...పాసులు లేకున్నా అనుమతిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



ప్రాక్టీసులో పాల్గొన్న రింకూసింగ్

పరీక్షల ఫీజు గడువు పెంపు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీసీసీ-2024 ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) -2024 పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీసీసీ లోయర్, హయ్యర్ అభ్యర్థుల పరీక్షల ఫలితాల వివరాలు https://www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పాస్ సర్టిఫికెట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రాగానే అభ్యర్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

అంగన్‌వాడీలకు
రూ.3.25 కోట్ల నిధులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: జిల్లాలోని అంగాన్‌వాడీలకు రూ.3.25 కోట్లు మంజూరైనట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు కోసం ఈ నిధులు కేటాయించారని ఆమె తెలిపారు. వీటితో 609 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు నిర్మించడానికి, ఒక్కొక్క కేంద్రానికి రూ.36 వేలు చొప్పున రూ.2.19 కోట్లు, 623 కేంద్రాల్లో మంచినీటి సదుపాయం కోసం, ఒక్కొక్క కేంద్రానికి రూ.12 వేలు చొప్పున రూ.1.06 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనుల నిర్వహణ బాధ్యతలను అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు అప్పటించినట్లు ఆమె స్పష్టంచేశారు.

ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 18: టెక్నికల్ కోర్సులకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ అన్‌లూమ్ వీవింగ్‌లో లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌లో లోయర్, హయ్యర్ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించామని, వాటి ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసిందని వివరించారు. ఉత్తీర్ణత, మార్కుల జాబితాను www.bse.ap.gov.inలో పొందవచ్చని పేర్కొన్నారు.

గడువు పొడిగింపు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు దరఖాస్తు గడువు ఈ నెల 24 వరకు ప్రభుత్వం పొడిగించిందని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.inలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్షలు రాసే సమయానికి అన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. దరఖాస్తు ప్రింటెడ్ నామినల్‌రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్టు రసీదును జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 27లోగా అందించాలని సూచించారు.

జీడిపల్లికి 909 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 18: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 909 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 864 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.675 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.36

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని తెలిపారు. కిలో గరిష్ఠ ధర రూ. 36, సరాసరి ధర రూ.29, కనిష్ఠ ధర రూ.20పలికినట్లు ఆయన తెలిపారు.



సీఎంకు రూ. ఐదు లక్షల చెక్కును అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

వరద బాధితులకు చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ధర్మవరం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సీఎం చంద్రబాబునాయుడుకు రూ. ఐదు లక్షల చెక్కును అందజేశారు. బుధవారం ఉండవల్లి నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశంలో పరిటాల శ్రీరాం పాల్గొన్నారు. అనంతరం ఆయన సీఎంకు పరిటాల మెమోరియల్ ట్రస్టు తరఫున ఆ విరాళాన్ని అందజేశారు. అనంతరం విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

సురేష్ నాయుడు రూ.లక్ష విరాళం



పుట్టపర్తిరూరల్: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి తమ వంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి టీడీపీ యువ నాయకుడు ఊరువాకిలి సురేష్ నాయుడు రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. బుధవారం టీడీపీ నాయకులతో కలసి విజయవాడలో మంత్రి నారాలోకేశ్‌కు ఆ చెక్కును అందచేశారు.

తుమ్మలకుంట్లపల్లి గ్రామస్థుల ఆర్థిక సాయం

ఓబుళదేవరచెరువు: వరద బాధితులకు తమవంతుగా మండ లంలోని తుమ్మలకుంట్లపల్లి గ్రామస్థులు బుధవారం రూ.45 వేలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి లక్ష్మీనారాయణకు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ఇర్షాన్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, ఫారూన్ పాల్గొన్నారు.



నగదును అందచేస్తున్న ఉంట్లపల్లి వాసులు

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక



బాదుల్లా

కదిరి, సెప్టెంబరు 18 : శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాదుల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం నూతిమడుగు గ్రామానికి చెందిన కె. కార్తీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుకు ఎంపికయ్యారు. బాదుల్లా ఇగ్నో అనే హారర్ వెబ్ సిరీస్ తీశాడు. అలాగే కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ మహాశివ అనే షార్ట్ ఫిల్మ్‌ను తీశాడు. మహాశివుని ఆలయం గురించి దాని ప్రాధాన్యంను అందులో వివరించాడు. వీరిద్దరూ బెస్ట్ షార్టు ఫిల్మ్ డైరెక్టర్ అవార్డుకు ఎంపికయ్యారు. వీరిద్దరికీ వచ్చే నెల 17న అవార్డులు అందజేస్తారు.

అలరించిన మలేషియా భక్తుల గానకచేరి

పుట్టపర్తి, సెప్టెంబరు 18 : మలేషియా భక్తులు భక్తిగీతాలాపనతో భక్తులను అలరింపచేశారు. బుధవారం పర్తియాత్ర పేరుతో మలేషియా భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత గానకచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను తన్మయులను చేశారు. అనంతరం సత్యసాయి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. గాయకులకు సత్యసాయి గ్లోబల్ చైర్మన్ చక్రవర్తి ప్రశంసా పత్రాలను అందచేసి సన్మానించారు.



పాటలు పాడుతున్న మలేషియా భక్తులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ధర్మవరం, సెప్టెంబరు 18 : లేపాక్షిలోని నవోదయ పాఠశాలలో ఈనెల 6న నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో స్థానిక జీవన్ జ్యోతి పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఏడో తరగతి చదువుతున్న ఎం.రీతుశ్రీ, పి.ప్రియదీప్తి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 20, 21 తేదీలలో కడప జిల్లాలోని వేంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సుజాత తెలిపారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 18: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల్లో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్ గౌతమసాయి, హరినాథ్, నరేష్, మంజునాథ్, కబడ్డీలో బాలికలు చందన, దీక్షత, లయశ్రీ, హరిణీ, స్పందన ఎంపికయ్యారు.



ప్రతిభ చాటిన విద్యార్థులు

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 18 : జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆర్లశ్రీనివాసులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కలను అందచేశారు.

ప్రజాధనం.. నిరుపయోగం

- రూ. 1.95 కోట్లతో వసతి గృహం
- టీడీపీ హయాంలో నిర్మాణం
- ప్రారంభించని వైసీపీ ప్రభుత్వం
- పట్టించుకోని అధికారులు
- మందుబాబులకు నిలయమైన వైనం
- పరికరాలు ధ్వంసం



ధ్వంసమైన ఫ్యాన్



గదుల్లో పగులకొట్టిన మద్యం బాటిళ్లు



బాలికల వసతి గృహం

గాండ్లపెంట, సెప్టెంబరు 18: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 1.95 కోట్ల ఆర్ఎంఎస్ఏ నిధులతో బాలికల వసతిగృహాన్ని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. అన్ని హంగులతో 20 తరగతి గదులు, వంట గది తదితర వాటిని ఏర్పాటు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో సుమారు ఐదున్నర ఏళ్లగా అది నిరుప యోగంగా పడి ఉంది. ఈ గృహం వైపు వైసీపీ పాలకులు, అధికారులు కన్నెత్తీ చూపకపోవడంతో నేడు గబ్బిలాలకు నివాసంగా మారింది. ఆకతాయిలు తాళాలు పగలకొట్టి ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, వాస్ బేసిన్ వద్ద కొళాయిలు, పైపులైన్లతోపాటు, బోరు స్టాటర్ కూడా ఎత్తుకెళ్లారు. మరికొన్ని పరికరాలు ఆకతాయిలు ధ్వంసం చేశారు. అంతేకాకుండా మందు బాబులకు ఇది అడ్డాగా మారింది. నిత్యం అక్కడ మద్యం సేవించి బాటిల్స్ పడేసి, గదుల్లో పగల కొడుతున్నారు. ఇలా రూ.కోట్ల ప్రజాధనం వృథా అయింది. ఇప్పటికైనా కూటమి పాలకులు చొరవ తీసుకొని.. ఈ వసతి గృహాన్ని విని యోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చోరీకి గురైన బోరు స్టార్టర్

వినియోగంలోకి తెస్తాం

బాలికల వసతి గృహాన్ని ట్రైబ్ -4 కేజీబీవీగా ఉపయోగించుకునేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు అందాయి. త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తాం.

- క్రిష్ణానాయక్, ఎంఈఓ

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, సెప్టెంబరు 18 : స్థానిక మార్కెట్‌యార్డ్ సమీపంలోని రమణ మహర్షి ఆశ్రమంలో బుధవారం ఆశ్రమ వ్యవస్థాపకులు చిప్పలవెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో రమణ మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం గో నెయ్యితో అరుణాచల జ్యోతిని వెలిగించారు. భక్తులకు గోమాతను పూజించారు. మధ్యాహ్నం సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నారాయణసేవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో...

పౌర్ణమి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగాస్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం బీజేపీ నాయకులు అన్నదానం చేశారు. ఇందులో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య, బృందం సభ్యులు, బీజేపీ నాయకులు హరీశ్ సాకే ఓబులేసు, రామాంజినేయులు, చంద్ర పాల్గొన్నారు.



గో పూజ చేస్తున్న భక్తులు

తుంపర్తి బాధిత రైతులను ఆదుకోండి

రెవెన్యూశాఖ మంత్రికి పరిటాల శ్రీరామ్ వినతి

ధర్మవరం, సెప్టెంబరు 18 : ధర్మవరం మండలం తుంపర్తి గ్రామ రైతుల నుంచి ఇళ్లస్థలాల కోసం సేకరించిన భూములకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ కోరారు. బుధవారం విజయవాడలో వినతి పత్రం అందజేశారు. తుంపర్తి గ్రామానికి చెందిన 90 మంది నిరుపేద రైతు కుటుంబాల నుంచి 210 ఎకరాల భూమిని గతంలో ఇళ్లస్థలాల కోసం సేకరించారన్నారు. ఎకరాకు రూ.5 లక్షల పరిహారం కొందరు... తీసుకోగా మెజారిటీ రైతులు ఒప్పు కోక పోవడంతో వారికి ఒక్క రుపాయి కూడా పరిహారం ఇవ్వకుండా గృహాలను నిర్మించారన్నారు. ఈ అన్యాయంపై సంబంధిత రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, రైతులకు న్యాయం చేయమని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా ఎలాంటి ప్రయోజనమూ లేదని అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నాటి ముఖ్యమంత్రి జగన్ ధర్మవరం మీదుగా పుట్టపర్తి విమానాశ్రయానికి అదే దారిలో వెళ్తుండగా రైతులు అడ్డుకోవడానికి ప్రయత్నం చేయగా వారిపై కేసులు బనాయించారన్నారు. ఆ రైతులపై అక్రమ కేసులు కొట్టివేసి.. పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా..

నేడు అన్నక్యాంటిన్ల ప్రారంభం

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పక్కన, ఎల్‌పీ సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటిన్లను గురువారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ డీఈ వీరేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొంటారని, కావున అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు మంత్రి పర్యటన

ధర్మవరం : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గురు, శుక్రవారాలు ధర్మవరంలో పర్యటిస్తున్నట్లు డీపీఆర్‌ఓ వేలాయుధం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు అనంతపురం నుంచి ధర్మవరం వస్తారన్నారు. సాయంత్రం ఏడు గంటలకు అన్నక్యాంటీన్ ప్రారంభిస్తారని, అనంతరం రాత్రి 8గంటలకు తిరిగి అనంతపురం చేరుకుని అక్కడే బస చేస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 9-45 గంటలకు అనంతపురం నుంచి ధర్మవరం వస్తారని, మధ్యాహ్నం వరకు ధర్మవరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని, మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్డు మార్గాన బెంగుళూరు వెళ్తారని తెలిపారు.

మంత్రి వర్గ తీర్మానంపై హర్షం

పుట్టపర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానం చేయడంపై జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డే అంజినప్ప బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదుగుదల టీడీపీతోనే సాధ్యమన్నారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు దాకా బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉందన్నారు. ఈ సిఫార్సు చేయడంపై సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు ఎంపీ పురంధరేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

పుట్టపర్తి రూరల్: నియోజకవర్గంలోని బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గురువారం రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తారని ఆయా మండల వ్యవసాయ అధికారుల పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు కొత్తచెరువు, నాలుగు గంటలకు బుక్కపట్నం, ఐదు గంటలకు పుట్టపర్తి రైతు సేవా కేంద్రాల్లో ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు పుట్టపర్తిలో అన్నక్యాంటీన్ ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీతో ఉలవలను గురువారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ఇలియాజ్ అహమ్మద్ తెలిపారు. 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలను అందచేస్తోందన్నారు.

రేపటి జాబ్‌మేళా వాయిదా

కదిరి అర్బన్: స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించాల్సిన జాబ్‌మేళాను అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత బుధవారం ఓప్రకటనలో తెలిపారు. తదుపరి జాబ్‌మేళ తేదీని ప్రకటిస్తామన్నారు.

అత్యాధునిక ప్రయోగశాల ప్రారంభం



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత

కదిరి అర్బన్, సెప్టెంబరు 18 : పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యాధునిక రసాయన శాస్త్ర ప్రయోగశాలను ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రయోగశాల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టత్మక పరిశోధన సంస్థ అయిన డీఎస్‌పీ-ఎస్‌ఈఆర్‌పీ నుంచి దాదాపు రూ.28 లక్షల విలువైన ప్రాజెక్టును సాధించిన రసాయన శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ యూవీ. సుబ్బారెడ్డిని అభినందించారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టులు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలో ఉంటాయని, అలాంటిది డిగ్రీ కళాశాలకు ఈప్రాజెక్టు రావడం హర్షించతగ్గ విషయమని అన్నారు. అధ్యాపకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ... యాంటిఫంగల్, యాంటీ బ్యాక్టీరియా, యాంటీ కేన్సర్ గుణాలు కలిగిన ఔషదాలు తయారు చేయడానికి ఉపయోపగడే రసాయన ప్రక్రియలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రయోగం విజయవంతమైతే బయోలాజికల్ యాక్టీవిటీ కలిగిన అనేక సహజ ఉత్పత్తులను తయారు చేయడంలో ముందడుగు వేసినట్లు అవుతుందన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం



ధర్మవరం : స్థానిక యాదవవీధి వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభం బుధవారం విరిగిపడింది. అయితే ఆ సమయంలో కరెంట్ లేకపోవడం... అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణ పడిపోయిన స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.



మంగళగిరిలో బుధవారం నిర్వహించిన కూటమి ప్రజాప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి, మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎమ్మెల్యేలు కాలవ, కందికుంట



వెంగళమ్మచెరువులో కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తా

జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి, సెప్టెంబరు 18 : తన ప్రాణమున్నంత వరకు పుట్టపర్తి నియోజకవర్గప్రజలకు సేవచేస్తానని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, అభిమానులు, విద్యార్థుల మధ్య ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది సమక్షంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యువతకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యే, మంత్రి, విప్‌గా, చీఫ్‌విప్‌గా పదవులు చేపట్టానని, తన కోడలు పల్లె సింధూరారెడ్డిని సైతం గెలిపించిన ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని అన్నారు. పదవి లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. అభిమానులు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి.. పల్లెను ఘనంగా సన్మానించారు. వెంగళమ్మచెరువులోనూ అభిమానుల మధ్య పల్లె భారీ కేక్‌ను కట్ చేశారు.

బుక్కపట్నం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో...



72 కేజీల కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం :పుట్టపర్తిలోని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జన్మదిన వేడుకలకు టీడీపీ మండల నాయకులు భారీగా తరలివచ్చారు. వారి ఆధ్వర్యంలో 72 కేజీల కేక్‌ను పల్లె కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామలక్ష్మణ్, రత్నప్పచౌదరి, కొనంకి గంగాధర్‌నాయుడు, సురేష్‌నాయుడు, క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో...



ముదిగుబ్బలో రక్తదానం చేస్తున్న యువకులు

ముదిగుబ్బ,సెప్టెంబరు 18: మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. అనంతరం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ వాణీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఇతరులు మొత్తం 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీఐ ప్రిన్సిపాల్స్ ప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుధాకర్, అధ్యాపకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, నారాయణస్వామి, నర్మద, లతపాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు



ధర్మవరం, సెప్టెంబరు 18 : స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై పట్టణపుర వీధుల్లో బుధవారం రాత్రి ఊరేగించారు. ఈ ఊరేగింపులో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య, శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

క్రైం న్యూస్

కంకర మిషన్‌లో ఎక్స్‌కవేటర్ సీజ్

కదిరి, సెప్టెంబరు 18 : మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల పొలంలో ఉన్న శివసాయి కంకర మిషన్‌లోని ఓ ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. రెండు రోజుల కిందట మైనింగ్ అధికారులు మిషన్‌ను సీజ్ చేసిన విషయం తెల్సిందే. అయినా అందులో కంకర మిషన్ యజమాని ప్రణీత్‌రెడ్డి తమ్ముడు, మరో డ్రైవర్ అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్లు మైనింగ్ అధికారి శ్రీవాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్రమ మైనింగ్‌కు ఉపయోగించిన హిటాచిని సీజ్ చేసి స్థానిక ఆర్టీసీ డిపోకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 18 : మండలంలోని తనకంటివారిపల్లి వద్ద మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై తన సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ నరేంద్ర బుధవారం తెలిపారు. వారి నుంచి నుంచి రూ.59,200 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై కేసు

తనకల్లు, సెప్టెంబరు 18: మండలంలోని రాచువారిపల్లికి చెందిన మస్తాన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి అధికంగా వడ్డీ వసూలు చేస్తుండగా.. వారిపై కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. బుధవారం వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ... రాచువారిపల్లికు చెందిన శివ, మరో ఐదుగురికి అప్పులిచ్చిన వీరు ఖాళీ బాండ్లు మీద సంతకాలు తీసుకుని, తరువాత నూటికి రూ.పది, రూ. 20 వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో బాధితుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బుధవారం ఈతోడు రోడ్డులో ఉన్న మస్తాన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డిని అరెస్ట్ చేశామని, మరో వడ్డీ వ్యాపారి పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి వద్ద ఉన్న ఐదు ఖాళీ ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బియ్యం పట్టివేత

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 18: మండలంలోని గొట్లూరు గ్రామ సమీపంలో ఐచర్ వాహనంలో తరలిస్తున్న 16.50 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర బుధవారం తెలిపారు. ఆ బియ్యం బెంగుళూరుకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఐచర్ వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని, నిందితులు తరుణ్‌రెడ్డి, రమేష్, రవిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి అధ్వ ర్యంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 పంచాయతీల్లో గ్రామసభల ద్వారా ఎంపిక చేసిన పనుల పురోగతిపై చర్చించారు. కూలీలకు వసతులు, వేతనాల చెల్లింపులో జాప్యం వహించరాదన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ ఇతర పథకాలను అమలులో భాగంగా రైతులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతం కేసులో ఇద్దరికి జైలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 18: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన కేసులో నిందితులు డిష్ ఆపరేటర్ గాజుల మహేష్, లైన్‌మేన్ శంకర్‌రెడ్డికి ఆరునెలల జైలుశిక్ష పడినట్లు ఎస్‌ఐ రమేష్ బుధవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. నాగినాయనిచెరువుకు చెందిన నీరుగంటి బాబయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని అన్నారు. దీనిపై అప్పట్లో కేసు నమోదుకాగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నిందితుల నేరం రుజువుకావడంతో ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయాధికారి మసాలా బొజ్జప్ప ఆరు నెలల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు జిల్లాస్థాయి హిందీ భాషా దినోత్సవం

పెనుకొండ, సెప్టెంబరు 18 : జిల్లా స్థాయిలో ఈనెల 20న హిందీభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు హిందీ దివాస్ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ జాబిలి చాంద్‌బాష ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో 20వ తేదీ ఉదయం 9.30కు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ చేతన్, జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షమ్మ, డీవైఈఓ రంగస్వామి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జీవిత కాలం హిందీభాషకు అంకితమై పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తామని వివరించారు.

డిగ్రీ కాలేజీలో..

పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ యశోదరాణి అధ్యక్షతన హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను తెలియజేశారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం ద్వారా ఎక్కువ ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. హిందీ అధ్యాపకులు హరిప్రసాద్ మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని తెలియజేశారు. సమావేశంలో అధ్యాపకులు ప్రతాప్, రామన్న, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 18: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈనెల 17న మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 15 రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగోపాల్, నాయకులు బాలకృష్ణ యాదవ్, గోపీనాథ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. నాన్న..!

బైక్‌పై తండ్రి మృతదేహాన్ని తరలించిన కుమారులు



తండ్రి మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో తరలిస్తున్న తనయులు

పావగడ, సెప్టెంబరు 18: ఆస్పత్రిలో కన్నుమూసిన కన్నతండ్రిని కుమారులు బైక్‌లో స్వగ్రామానికి తరలించిన హృదయవిదారక ఘటన ఇది. ఎంతసేపు వేచిచూసినా ప్రభుత్వ అంబులెన్సు రాకపోవడం, ప్రైవేటు వాహనాన్ని సమకూర్చుకునే ఆర్థికస్తోమత లేకపోవడంతో దిక్కుతోచక ఈ పనిచేశారు. కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా పావగడ తాలూకాలో బుధవారం ఈ విషాదకర సంఘటన తలెత్తింది. దళవాయిపల్లికి చెందిన గుడుగుల హొన్నూరప్ప (80) అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుమారులు చంద్రన్న, గోపాలప్ప వైఎన్ హొసకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్ కోసం చాలా సేపు వేచిచూశారు. అంబులెన్స్ రాకపోవడంతో తమ ద్విచక్రవాహనంపై తండ్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

అగళి, సెప్టెంబరు 18: మండల కేంద్రమైన అగళిలో కొలువైన వినాయకులను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. మెయిన్ బజార్లోని బసవన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని వెండి రథంపై ఊరేగిస్తూ గురవయ్యలచే నాట్యం చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అగళి బస్టాండు ఆవరణంలో స్వామివారికి ప్రత్యేకమైన అలంకరణ ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. అనంతరం సమీపంలోని చెరువులో వినాయక నిమజ్జనాన్ని గావించారు.

23లోగా ఈ-క్రాప్ చేయించుకోవాలి

మడకశిర రూరల్, సెప్టెంబరు 18: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ నెల 23లోపు ఈ-క్రాప్ న మోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 8,351 మంది రైతులు 18,920 ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 99 శాతం పంట నమోదు చేసినట్లు చెప్పారు.

మితిమీరిన తాగుబోతుల ఆగడాలు

ఎక్కడపడితే అక్కడే మద్యం సీసాలు

జనం బెంబేలు... పట్టించుకోని పోలీసులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 18 : మండల కేంద్రంలోని గీతానగర్ ప్రాంతంలో తాగుబోతుల ఆగడాలు మితిమీరిపోయాయి. ప్రతిరోజూ మద్యం కొనుగోలుచేసి ఖాళీ సీసాలు, వాటర్‌బాటిళ్లను వీధుల్లోనే గృహాలవద్ద పారేసి వెళ్లిపోతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే గృహ యజమానులు వీరి ఆగడాలు భరించలేకపోతున్నారు. గుంపులుగా చేరి మద్యం సేవించడంతోపాటు ఆయా వీధుల్లో వీరి చేష్టలతో జనాలను విసిగిస్తున్నారు. దారింటి వచ్చివెళ్లే మహిళలు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.





గీతానగర్‌లో ఖాళీ మద్యం బాటిళ్లు, రోడ్లపై పడిపోయిన మందుబాబులు

రోడ్లమీద పడి దొర్లుతూ విన్యాసాలు చేస్తూ వచ్చి పోయేవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఓ వైపు మద్యం కంపు, మరోవైపు కైపెక్కిన మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలని స్థానిక ప్రజలు పోలీసులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. పోలీసుల హెచ్చరికలను సైతం వారు లెక్కచేయడంలేదు. వీధుల్లో పేరుకుపోయిన మద్యం సీసాలు, చెత్తాచెదారంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మాస్టర్‌వీవర్ సీసీ హరి బుధవారం కార్మికులను పిలిపించి చెత్తను తొలగింపజేశారు. వీరి ఆగడాలకు కళ్లెం వేయాలని కోరారు. మద్యం షాపులు ఊరి బయట ఏర్పాటు చేయాలని, లేకపోతే కాపురాలు ఉండలేమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి వారి ఆగడాలు అరికట్టాలని కోరుతున్నారు.

10 ద్విచక్రవాహనాల స్వాధీనం

హిందూపురం, సెప్టెంబరు 18 : చెడు వ్యసనాలకు బానిసై డబ్బు ఇచ్చేవారు లేక ద్విచక్రవాహనాలు చోరీకి అలవాటుపడిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ మహేష్ బుధవారం తెలిపిన వివరాల మేరకు.. పుట్టపర్తి మండలం పెద్దకమ్మవారిపల్లికి చెందిన ముమ్మినేని రమేష్ అలియాస్ మారుతి అనే యువకుడు కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. మద్యం తాగడానికి డబ్బులేకపోవడంతో ద్విచక్రవాహనాలు చోరీచేసి వాటిని అందిన కాడికి అమ్మేసి వచ్చిన డబ్బుతో చెడు వ్యసనాలు, విలాసాలకు అలవాటుపడ్డాడు. గత యేడాది ఆగస్టులో హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ఈ యేడాది ఆగస్టు 29న పాత రైల్వేస్టేషన్ వద్ద ఆపి ఉన్న ద్విచక్రవాహనాన్ని చోరీచేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా సీఐలు ఆంజనేయులు, రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం దర్యాప్తు చేపట్టగా సదరు యువకుడు రహమత్‌పురం సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. విచారణ చేపట్టగా హిందూపురం పట్టణం, సరిహద్దు ప్రాంతంలో 10 ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చొరవ చూపిన హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, సునీల్‌నాయక్, మహేష్, కానిస్టేబుల్ రాము, రంగను డీఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు.. నిందితున్ని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐలు

హౌసింగ్‌బోర్డులో భారీ చోరీ

23 తులాల బంగారు నగలు, రూ.3లక్షల నగదు అపహరణ

హిందూపురం, సెప్టెంబరు 18 : స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డులో నివాసమున్న తాజుద్దీన్ ఇంట్లో భారీ చోరీ జరిగినట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. తాజుద్దీన్ తూమకుంట పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం పనికోసం వెళ్లాడు. తాజుద్దీన్ భార్య ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం సమీపంలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. కొంత సమయం తరువాత ఇంటివద్దకు వచ్చి చూడగా మెయిన్‌గేటుకు తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంటి తలుపులకు తాళాలు పగలకొట్టి ఉండటం చూసి భర్తకు సమాచారం ఇచ్చింది. ఆయనవచ్చి చూసేసరికి ఇంటిలో బీరువా తాళం పగలకొట్టి అందులో ఉన్న ఏడు తులాల లాంగ్ చైను, మూడు తులాల నెక్లెస్, రెండు తులాల నల్లపూసల చైను, రెండు తులాలున్న మెడచైను, ఉంగరాలు, కమ్మలు, జుంకీలు, గాజులు, పాపిడిబిల్ల, మొత్తం కలుపుకుని 23 తులాలు ఆభరణాలతోపాటు కొన్ని వెండి ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.3 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బీరువా తలుపులు విరగ్గొట్టిన దృశ్యం

డిపో ఉన్నా సేవలు అంతంతే

కాలంచెల్లిన బస్సులతో ఇబ్బందులు

ప్రయాణికులను పట్టించుకోని అధికారులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 18 : పేరుకు మాత్రమే ఆర్టీసీ బస్సు డిపో ఉంది కానీ తమకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు 2009లో ఐదు బస్సులతో డిపోకు అంకురార్పణ పడింది. 2011 సంవత్సరానికి 23 బస్సులు కాగా నేటికీ డిపోలో 32 ఆర్టీసీ బస్సులు, మరో ఐదు అద్దె బస్సులతోనే డిపోను నెట్టుకొస్తున్నారు. గతంలో ఆదాయం బాగానే ఉన్నా రాను రాను కొంత మేర నష్టం వాటిల్లుతున్నట్లు ఆర్టీసీ సిబ్బంది ద్వారా తెలిసింది. కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాంతోపాటు సమయానికి బస్సులు నడపకపోవడంతో ఆర్టీసీపై రోజు రోజుకూ నమ్మకం సన్నగిల్లుతోంది. బస్సులు కండీషన్ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. ఇటీవల గుడిబండ, రొళ్ల మండలం కొడగార్ల గుట్ట వద్ద, మడకశిర పట్టణంలో ఇలా అనేక చోట్ల బస్సులు ఆగిపోవడంతో ప్రయాణికులే దిగి తోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆటోలు, మినీక్యాబ్‌లు ఎక్కువ కావడంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగానే గండిపడుతోంది. వెనకబడిన ప్రాంతంలో ప్రయాణికులకు సకాలంలో గ్రామీణ ప్రాంతాలకు చేర్చాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. గతంలో రోజుకు డిపో ఆదాయం రూ.3.30 లక్షలు కాగా ప్రస్తుతం బస్సులు విజయవాడ, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాలకు బస్సుల సౌకర్యం ఏర్పాటు చేయడం వల్ల రూ.4.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. దూర ప్రాంతాలకు బస్సులు నడపడం వల్ల రూ.లక్ష వరకు ఆదాయం సమకూరింది. అదేవిధంగా పలు సర్వీసులకు ఆదాయం రావడం లేదని రద్దు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఎం.రాయాపురం, శిరా నైట్‌హాల్ట్, పావగడ, అగళి, ఇలా కొన్ని ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆపడం వల్ల ఆప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టణంలో బస్సు మొరాయించడంతో తోస్తున్న ప్రయాణికులు

రేపటి నుంచి క్రీడాపోటీలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 18 : మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20,21 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి భాస్కర్, క్రీడల సమన్వయకర్త నాగభూషణ, ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, యోగ, షటిల్, బాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ, ఎంజేపీ, ఆదర్శ పాఠశాలలోని బాలబాలికలు పోటీలో పాల్గొంటారని తెలిపారు.

80 శాతం సబ్సిడీతో ఉలవలు

రొళ్ల, సెప్టెంబరు 18 : రొళ్ల మండలంలోని రైతు సేవా కేంద్రంలో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అర్హత కల్గిన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మీ కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఆసక్తి కల్గిన రైతులు వారి ఆధార్ కార్డును రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించి, పది కిలోల ఉలవ విత్తనాలకు సబ్సిడీ పోను రూ.174కే పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. ఆసక్తి కల్గిన రైతులు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రీడల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు సన్మానం



గోల్డ్ మెడల్ సాధించిన వారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 18: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. అందులో మండలంలో రేకలకుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వేదాచలం,నారాయణస్వామి షటిల్ డబుల్‌లో ఘనం విజ యం సాధించారు. వారికి ఆ యూనియన్ తరుపున షీల్డుకప్పుతో పాటు గోల్డ మెడల్ అందజేశారు. ఆ ఉపాధ్యాయులను బుధవారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు మాలింగప్పపాల్గొని వారిని అభినందించారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 18 : వ్యవసాయ పొలాలకంటూ అనుమతులు పొంది యథేచ్ఛగా లేఅవుట్లకు అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పెనుకొండ మండలం కొండాపురం సమీపంలో కొందరు వ్యవసాయ పొలాలకని ఇరిగేషన్ అధికారులతో అనుమతులు పొంది చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా పట్టణంలోని లేఅవుట్లకు తరలిస్తున్నారు. చెరువులో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు పెట్టి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందేపాటగా కొనసాగుతోంది. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా కొండాపురం చెరువులో రైతుల పొలాల్లోకి 60 ట్రాక్టర్లు మట్టిని తరలించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. లేఅవుట్లకు చెరువు నుంచి మట్టి తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అక్రమంగా చెరువు మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



కొండాపురం చెరువులో యంత్రాల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

అధికారుల కోసం పడిగాపులు..!

హిందూపురం (పరిగి), సెప్టెంబరు 18 : ప్రజలకు ప్రభుత్వ పనుల్లో ఆటంకం లేకుండా ప్రతి పంచాయతీలోనూ సచివాలయాలు ఏర్పాటు చేశారు. పరిగి మండలంలోని హొన్నంపల్లి సచివాలయం ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి రాలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఉదయం 10.30 కావస్తున్నా సచివాలయం తలుపులు తెరవకపోవడంతో స్థానిక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జొన్నల పంపిణీ కోసం రావాల్సిన సచివాలయ వ్యవసాయాధికారి హాజరు కాలేదంటూ రైతులు తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో బుధవారం ఉదయం దాదాపు 30 మందికిపైగా రైతులు అధికారుల కోసం సచివాలయం ముందు పడిగాపులు కాశారు.



అధికారుల కోసం పడిగాపులు కాస్తున్న మహిళా రైతులు

బాలికల ఆటల పోటీల్లో విజేతలు వీరే

గోరంట్ల, సెప్టెంబరు 18: పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ద్వారా బాలికలకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. అండర్-17 విభాగం కబడ్డీలో ఖాజాపురం కేజీబీవీ విన్నర్‌గా, పాలసముద్రం పాఠశాల రన్నర్‌గా, చదరంగంలో కేజీబీవీ విన్నర్, గిరిజన గురుకుల పాఠశాల రన్నర్‌గా, వాలీబాల్ గిరిజన గురుకుల పాఠశాల విన్నర్, పులేరు ఉన్నతపాఠశాల రన్నర్‌గా, అండర్ 14 విభాగంగలో కబడ్డీ పాలసముద్రం ఉన్నతపాఠశాల విన్నర్, గిరిజన గురుకుల పాఠశాల రన్నర్‌గా, షటిల్ బ్యాట్మింటన్‌లో బాలికల ఉన్నతపాఠశాల విన్నర్, మల్లాపల్లి ఉన్నత పాఠశాల రన్నర్‌గా గెలుపొందారు. అండర్ 17, 14లో బాలికలకు 100, 200 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. గెలుపొందిన వారి పేర్లు ప్రకటించారు. విజేతలైన విద్యార్థులను నియోజకవర్గస్థాయి క్రీడల్లో ఆడతారని అన్నారు. న్యాయనిర్ణేతలుగా పీడీలు రామమోహన్, వెంకటరమణనాయక్, రవీంద్రనాయక్, రామచంద్రనాయక్, క్రిష్టారెడ్డి, మనోహర్, బాషా, సూర్యనారాయణమ్మ, ప్రమద, యమున, అంబిక, వసంత వ్యవహరించారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 18 : పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ గత 13 రోజులుగా వివిధ రకాలుగా ఆందోళనలు చేశామని తెలిపారు. సమ్మెకు స్పందించి మంగళవారం సత్యసాయి బోర్డు కమిటీ చైర్మన్ కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు సమావేశమై చర్చించారన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఈఎస్‌ఐ, పీఎఫ్, బకాయి వేతనాలకు సంబంధించి అన్ని సమస్యలను రెండు మూడు విడుతలుగా చెల్లిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో సమ్మె విరమించామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబావలి, అంగనవాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, బావమ్మ, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, మీనాకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ గుర్తింపుపై విద్యార్థినుల సంబరాలు



ర్యాలీగా వెళ్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

హిందూపురం, సెప్టెంబరు 18 : పట్టణంలోని ఎన్ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ నుంచి ఏ గ్రేడ్ లభించడంపట్ల కళాశాల విద్యార్థినులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ మహిళా డిగ్రీకళాశాలలో మంచి ఫలితాలు రావడంతో కళాశాలకు ఏ గ్రేడ్ వర్తించిందన్నారు. దీనివల్ల అధ్యాపకుల బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, రఫీక్, అధ్యాపకులు యశోద, శ్రీలక్ష్మీ, శ్రీధర్, బోజప్ప, నరసింహులు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



దుకాణంలో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 18: వరద బాధితుల కోసం సోమందేపల్లి మండల కేంద్రంలో బుధవారం విద్యార్థుల భిక్షాటన చేసి విరాళాలుసేకరించారు. రాష్ట్రంలో భారీ వర్షాలకు వరదలు పోటెత్తి గ్రామాలు, నగరాలు ముంచెత్తి అనేక మంది బాధితులు నిరాశ్రయులయ్యారు. బాధితుల సహాయార్థం మేము సైతం అంటూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కదిలారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో వ్యాపార వాణిజ్య సముదాయంలో పురవీధుల్లో గృహాల యజమానుల నుంచి విరాళాలు సేకరించారు. ఎవరికి తోచిన సాయం వారు చేయండని ప్రాధేయపడ్డారు. వీరివెంట పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయులు నడిచారు. సేకరించిన విరాళాలను ప్రభుత్వ సహాయనిధికి అందజేస్తామని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, కృష్ణవేణి, ప్రసాద్, రామక్రిష్టారెడ్డి, శ్రీనివాసులు పేర్కొన్నారు.

రెండోరోజూ స్వచ్ఛతాహి సేవ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పలు మండలాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని రెండోరోజూ కొనసాగించారు. సోమందేపల్లి మండల పరిధిలోని రంగేపల్లిలో సర్పంచ్ నరసింహులు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామస్థులు కలిసి రావాలన్నారు. లేపాక్షి మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలలోనూ స్వచ్ఛతామి సేవ నిర్వహిస్తున్నారు. సైకిల్ ర్యాలీ, వాకింగ్, డ్వాక్రా మహిళలకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాలలో డ్రైనేజీలను శుభ్రం చేసి నీటి నిలువలు లేకుండా కార్యక్రమాలను చేపట్టారు. రొద్దం మండలంలోని పెద్దమంతూరు, కలిపి గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను చేపట్టారు. పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు.

బొలెరో ఢీకొని విద్యార్థికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 18: రొద్దం మండలం సానిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే విద్యార్థిని బుధవారం బొలేరో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటేశ్ 8వ తరగతి చదువుతున్నాడు. తమ వ్యవసాయపొలంలో పండించిన మొక్కజొన్న విత్తనాలను రోడ్డులో ఆరబోశారు. అక్కడ నిలబడివున్న వెంకటేశ్‌ను సానిపల్లి గ్రామం నుంచి పెనుకొండ వైపు వేగంగా వెళుతోన్న బొలేరొ వాహనం ఢీకొంది. దీంతో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

అగళి, సెప్టెంబరు 18: మండలంలోని ఇరిగేపల్లికి చెందిన మహదేవమ్మ, కామరాజు కుమారుడు రంగనాథ్ (21) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు. రంగనాథ్ ఇంటర్ వరకు చదువుకున్నాడని చెప్పారు. మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడని, ఉన్నపళంగా మంగళవారం రాత్రి కాల్చుకుని చెరువులో పడి మృతి చెందాడన్నారు. తమ కుమారుడు కాల్చుకుని మృతిచెందాడా లేక ఎవరైనా చంపి చెరువులో వేశారా అని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.